ప్రజాశక్తి
సోమవారం 25 సెప్టెంబర్ 2023 8 పేజీలు




గుంటూరు పల్నాడు

అపరాల సాగుకు అనాసక్తి

పరిమితంగానే పప్పుదినుసుల సేద్యం - ధరలపై రైతులకు కొరవడిన నమ్మకంతో తగ్గిన విస్తీర్ణం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



మినుము పైరు



కంది పొలం

అపరాల సాగు రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి... కొనబోతే కొరివి... అన్న చందంగా మారింది. దీంతో ఈ ఏడాది అపరాల సాగుకు కూడా గుంటూరు, పల్నాడు జిల్లాల రైతులు ఆసక్తి చూపడం లేదు. మార్కెట్‌లో ప్రస్తుతం పప్పుదినుసుల ధరలు భారీగా పెరిగాయి. అయినా రైతులు సాగు చేసి దిగుబడులు చేతికి వచ్చే సరికి ఈ స్థాయిలో ధరలు లభిస్తాయనే నమ్మకం లేదు. వర్షాభావం వల్ల ఖరీఫ్‌లో మొదట మూడు నెలల పాటు ఏపంటలు సాగు చేయలేకపోయారు. అంతేగాకుండా ప్రత్యామ్నాయంగా అపరాల సాగుపై దృష్టి సారించాలని అధికారులు సూచిస్తున్నా రైతులు ఆసక్తి చూపడం లేదు.

పల్నాడు జిల్లాలో ఏటా 50 వేల ఎకరాల్లో కంది సాగవుతుంది. గతేడాది కందులు క్వింటాళ్ గరిష్టంగా రూ.6-7 వేలకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం కందిపప్పు మార్కెట్‌లో రూ.180 నుంచి రూ.190 వరకు పలుకుతోంది. కందులు క్వింటాళ్ రూ.12 వేల నుంచి రూ.13 వరకు పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కందుల సాగు పెరుగుతుందని అంచనా వేశారు. కానీ పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 8700 ఎకరాల్లోనే కంది సాగు చేశారు.

గుంటూరు జిల్లాలో 250 ఎకరాల్లోనే సాగు చేస్తారని అంచనా ఉండగా ఇప్పటి వరకు 200 ఎకరాల్లో చేశారు. మినుములు గుంటూరు జిల్లాలో 6 వేల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా 1500 ఎకరాలు, పల్నాడు జిల్లాలో 3 వేల ఎకరాలకు గాను 625 ఎకరాల్లో సాగైంది. ప్రస్తుతం మినప గుళ్ల కిలో రూ.130 నుంచి రూ.140 వరకు పలుకుతున్నాయి. కానీ గత సీజన్‌లో రైతుల నుంచి క్వింటాలు రూ.5 నుంచి రూ.6 వేలకు మించి కొనుగోలు చేయలేదు.

పెసర పల్నాడు జిల్లాలో వెయ్యి ఎకరాలకు గాను 160 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 300 ఎకరాలకు గాను 42 ఎకరాలు మాత్రమే సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో పెసర పప్పు కిలో రూ.120 ఉంటోంది. గత సీజన్‌లో పెసలు క్వింటాలు రూ.5 నుంచి 6వేల వరకు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో అపరాల ధరలు ఆశాజనకంగా ఉన్నా సాగు పెరగడంలేదు. ప్రధానంగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు దెబ్బతీస్తున్నాయని అపరాల రైతులు వాపోతున్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి ▶ 2లో



గుంటూరులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజా సమస్యలపై కృషి చేసిన కొరటాల సత్యనారాయణ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు - శత జయంతి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నివాళులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సమస్యలపై అధ్యయనం చేసి, పరిష్కారం కోసం కషి చేసిన గొప్ప ఆదర్శ నాయకుడు కొరటాల సత్యనారాయణ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ, గుంటూరు బాపనయ్య భవన్‌లో కొరటాల సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి వి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1923 సెప్టెంబర్ 24న తెనాలి ప్రాంతం, అమతలూరులో జన్మించిన కొరటాల సత్యనారాయణ విద్యార్థి దశనుండే అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని, నిర్బంధాలు, ఆటుపోట్లను ఎదుర్కొని చివరి వరకూ ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని చెప్పారు. పుచ్చలపల్లి సుందరయ్య తర్వాత సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ▶ 2లో



నరసరావుపేటలో చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న లక్ష్మీశ్వరరెడ్డి తదితరులు

మహిళా కౌలురైతు మృతి

ప్రజాశక్తి - తెనాలి

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాత్నం చేసిన మహిళా కౌలురైతు మృతి చెందారు. మండలంలోని గుడివాడకు చెంది. రుద్రపాటి సరోజిని (62), నాగేశ్వరరావు దంపతులు కౌలుకు భూమి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలోనే మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న నేపథ్యంలో అప్పులు పెరిగిపోయాయి. కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న క్రమంలో ఒత్తిడిని తట్టుకోలేని సరోజిని ఈనెల 21 రాత్రి ఎలుకల మందు తాగారు. ఈ విషయాన్ని చిన్న కొడుకు దిలీప్‌కు చెప్పటంతో బంధువుల సహాయంతో ఆమెను తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. అప్పటి నుండి చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం మృతి చెందారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దోమతెరలు వాడితే 95 శాతం జ్వరాలు రావు

- పంపిణీ కోసం 75 వేలు అవసరమని ప్రభుత్వానికి నివేదిక
- ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా నిర్ధారణ పరీక్షలు, చికిత్స
- దోమల నివారణకు ప్రజల సహకారమూ అవసరం
- పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్రరత్నాకర్

8 లో

మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఉధృతి

- దిగుబడులపై తీవ్ర ప్రతికూల ప్రభావం
- ఆందోళన చెందుతున్న రైతులు
- విత్తన శుద్ధి ద్వారా కట్టడి చేయొచ్చు
- జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ. మురళి

4 లో



పురుగుతో దెబ్బతిన్న పైరు



పీజీ సెట్ రాయకున్నా ఎఎన్‌యులో ప్రవేశాలకు అవకాశం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పలు పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రవేశాల విభాగం సంచాలకు డాక్టర్ జి.అనిత తెలిపారు. ఈ ప్రవేశాలకు సంబంధించి అభ్యర్థులు అనివార్య కారణాలతో ఏపీ పీజీసెట్ రాయలేక పోయినవారికి యూనివర్సిటీ నిర్వహించే ప్రత్యేకమైన సెట్ ద్వారా ప్రవేశాలు కల్పించే అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన పీజీ కోర్సుల్లో ఎంఎస్సీ కాంపిటేషనల్ డేటా సైన్స్, ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ, ఎంఎస్సీ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్, ఎంఎ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఎంఎ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ (థియేటర్, సినిమా), ఎంఎ మ్యూజిక్, ఎంఎ డాన్స్, ఎంటెక్ ఇన్ ఇరిగేషన్ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజినీరింగ్, ఎంబిఎ మీడియా మేనేజ్మెంట్, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్మెంట్, బిఎ మ్యూజిక్, బిఎ డాన్స్, బిఎ ప్లానింగ్, బిఎ డిజైన్ కోర్సులకు సంబంధించి సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులతో వర్సిటీ నిర్వహించే అర్హత పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. పై కోర్సులతోపాటు పలు పీజీ డిప్లమా కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. వాటిల్లో అంబేద్కర్ స్టడీస్, గాంధీయన్ స్టడీస్, బుద్ధిస్ట్ స్టడీస్, యోగ, గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్, డిప్లమా కోర్సుల్లో ఫిల్మ్ మేకింగ్, డైరెక్షన్, ఫొటోగ్రఫీ, యాక్టింగ్ వంటి కోర్సులకు సంబంధించి ఆసక్తి ఉన్న అభ్యర్థులు విశ్వవిద్యాలయంలోని పీజీ అడ్మిషన్ల కార్యాలయాన్ని సంప్రదించాలని డాక్టర్ అనిత సూచించారు.

నేడు చలో అసెంబ్లీకి జనసేన పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణాను నిరోధించాలని కోరుతూ సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం గుంటూరులోని జనసేన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. లారీల్లో పరిమితికి మించి రవాణా చేయడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయన్నారు. ఇసుక కాంట్రాక్టర్ల నుంచి సిఎంజగన్‌కు ప్రతి జిల్లా నుంచి ప్రతినెలా ముడుపులు వెళ్తున్నాయన్నారు. ఒక్కొజిల్లాలో ఒక్కొ నాయకుడ్ని కాంట్రాక్టరుగా పెట్టుకున్నారని అన్నారు. ఈ అంశాలపై అసెంబ్లీకి వెళ్లి సిఎం జగన్‌కు వినతిపత్రం ఇచ్చేఁందుకు మిత్రపక్షాలైన టిడిపి, బిజెపితో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. తాడేపల్లిలో సిఎం జగన్ నివాసానికి వెళ్లేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వడం లేదని కనీసం అసెంబ్లీలో అయినా కలిసే అవకాశం ఇవ్వాలన్నారు.

అపరాల సాగుకు అనాసక్తి

(మొదటి పేజీ తరువాయి)

వ్యయం అధికంగా ఉంటోంది. అపరాలు సాగు చేసిన వెంటనే మూడు నాలుగు రోజులు భారీ వర్షం కురిస్తే పైరు కుళ్లిపోయి ఎందుకు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. నెల రోజులపాటు వర్షంలేకున్నా ఎదుగుదల ఉండదు, దిగుబడి తగ్గిపోతుంది. పైగా తెగుళ్ల సమస్య ఎక్కువగా ఉంటోంది. అంతేగాక పంట చేతికి వచ్చే సరికి ధరలు పడిపోతాయి. అందువల్ల అపరాల సాగుకు విముఖంగా ఉన్నట్టు పలువురు రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ.20-30 వేల వరకు పెట్టుబడి పెట్టినా పట్టుమని 10 బస్తాలు కూడా రాకపోతే నష్టం మూటగట్టుకోవాల్సి వస్తుంది.

రెండేళ్లుగా శనగల ధరలు క్వింటాలు రూ.4,500 దాటడం లేదు. శనగల ధరలేక తక్కువకు అమ్ముకోలేక రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఆరుతడి పంటలు సాగు చేయాలని ప్రభుత్వం చెబుతున్నా రైతులు ఇంకా పూర్తిగా దృష్టి పెట్టలేదు. జొన్న, మొక్కజొన్న సాగు విషయంలో రైతులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఖరీఫ్‌లో కంటే రబీలోనే జొన్న, మొక్కజొన్న సాగు మేలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై కృషి చేసిన కొరటాల సత్యనారాయణ

(మొదటి పేజీ తరువాయి)

మరింత ముందుకు తీసుకువె ళ్లారన్నారు. కొరటాల సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు జరపనున్నట్లు తెలిపారు. బంజర భూములు, చల్లపల్లి జమిందారికి వ్యతిరేకంగా కొరటాల నడిపిన కూలి పోరాటాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో మరొక అరుణ తారగా నిలిచిన గుంటూరు బాపనయ్య నడిపిన సామాజిక ఉద్యమాలు, పోరాటాలను గుర్తు చేశారు. 1964, 1965లో పార్టీ చీలినప్పుడు పార్టీ పున: నిర్మాణంలో కొరటాల సత్యనారాయణ కీలక పాత్ర పోషించారని, పార్టీ, ప్రజా సంఘాలతో పాటు ప్రజాశక్తి అభివద్ధికి కొరటాల సత్యనారాయణ కషి మరువలేనిదని వివరించారు. మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, సమస్యలను అధ్యయనం చేయడం ద్వారానే వాటి పరిష్కారానికి కొరటాల సత్యనారాయణ కషి చేసేవారని, రైతు సమస్యలు అధ్యయనం చేయడంతో పాటు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో రైతు ఆత్మహత్యలపై స్వయంగా పరిశీలించారని చెప్పారు. పార్టీ కార్యకర్తలతో ఆప్యాయంగా మెలుగుతూ స్ఫూర్తి నింపేవారని, ఆయన స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ కొరటాల స్యతనారాయణ జాతీయోద్య మంలో, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా నిలబడిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ ఉద్యమాల్లో వచ్చే ఆటుపోట్లను ఎదుర్కొని ఎలా నిలబడాలో కొరటాల సత్యనారాయణ నుండి నేర్చుకోవాలని అన్నారు. గుంటూరు జిల్లాతో ప్రత్యేక అనుబంధం కలిగిన ఆయన.. కార్యకర్తలను అరేయ్ బాబు అంటూ ఆప్యాయంగా పలకరించే వారిని చెప్పారు. తాము విద్యార్థి దశ నుండి కొరటాల స్ఫూర్తితో పని చేశామన్నారు. ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసిదాస్ మాట్లాడుతూ రైతు, వ్యవసాయ సమస్యలపట్ట పూర్తి అవగాహన ఉన్న నాయకుడు కొరటాల సత్యనారాయణ అని చెప్పారు. కొత్త విషయాలను ఎప్పటికప్పుడు నేర్చుకొని, అధ్యయనం చేసేవారని, ఆయన బహుముఖ కషివలుడని అన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ రైతు సమస్యలపై నిరంతరం పని చేసిన కొరటాల సత్యనారాయణ ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నుండి నిధులు రాబట్టడంలో ఎంతో కృషి చేసేవారన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొరాటాల సత్యనారాయణ కృషిని శత జయంతి ఉత్సవాల ద్వారా ప్రజలకు తెలిజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, సిఐటియు రాష్ట్ట నాయకులు కె.ఉమామహేశ్వరరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, కౌలు రైతు సంఘం రాష్ట్ర అద్యక్షులు వై.రాధాకష్ణ, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు డి.వెంకటరెడ్డి, కె.శివరామకష్ణయ్య, ఎం.శ్రీనివాసరెడ్డి, సిఐటియు నాయకులు వి.దుర్గారావు, బి.వెంకటేశ్వరరావు, ఐద్వా నాయకులు డి.శ్రీనివాసకుమారి, శాంతి, పి.గిరిజ, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుంటూరు

కొరటాల సత్యనారాయణ ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. కొరటాల సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల ప్రారంభ సందర్భంగా ఆదివారం బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి సిపిఎం సీనియర్ నాయకులు ఎన్.వేణుగోపాలరావు, ఎమ్.డి అక్బర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ తన జీవితాంతం పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. శాసన సభ్యునిగా రెండుసార్లు ఎన్నికై రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను చట్టసభల్లో మాట్లాడారని చెప్పారు. చేనేత కార్మికుల సమస్యలను అధ్యయనం చేసి అవి పరిష్కారమయ్యే వరకూ దశల వారీగా ఆందోళన చేశారన్నారు. లంకభూములను భూస్వాములు ఆక్రమించుకోగా పేదలను కదిలించి ఆందోళన చేసి వందలాది ఎకరాలు పేదలకు దక్కే విధంగా సొసైటీలను ఏర్పాటు చేశారని తెలిపారు. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని అతివాద, మితవాద, విచ్ఛిన్నకర శక్తుల నుండి కాపాడి పార్టీని అభివృద్ధి చేశారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి మాట్లాడుతూ విద్యార్థి, యువజన ఉద్యమాలపై కొరటాల సత్యనారాయణ ప్రత్యేక శ్రద్ధ పెట్టేవారని, యువతను ప్రోత్సహించేవారని అన్నారు. రైతు రక్షణ వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వేణుగోపాలరావు మాట్లాడుతూ చిన్న రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై లోలైన అధ్యయనం చేశారని, చేనేత కార్మికుల ఆత్మహత్యలపై పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదిక నిచ్చి పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఇ.అప్పారావు, నాయకులు బి.లక్ష్మణరావు, వి.వి.కె.సురేష్, కె.అజయ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, ఖాశింషహీద్, వై.కృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని కోటప్పకొండ రోడ్డులో ఉన్న పల్నాడు విజ్ఞాన కేంద్రంలో కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. సభకు డి.శవకుమారి అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన కొరటాల సత్యనారాయణ పీడిత ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు చేశారని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య వంటి నాయకులతో కలిసి పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కె.రామారావు, సిలార్ మసూద్, ఆంజనేయరాజు, మస్తాన్‌వలి, సుభాని, ఫాతిమా పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి


సత్తెనపల్లి


చిలకలూరిపేట

చేనేత రంగ సమస్యల పరిష్కారానికై కొరటాల సత్యనారాయణ చేసిన కృషి మరువలేనిదని సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు కె.శివదుర్గారావు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని పుతుంబాక భవన్‌లో కొరటాల సత్యనారాయణ శతజయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల అధ్యక్షత వహించగా తొలుత కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివదుర్గారావు మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ విద్యార్థి దశలోనే రాజకీయాలకు ఆకర్షితులై స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని, ఆ తర్వాత వామపక్ష రాజకీయాలకు ఆకర్షితులైన తెలంగాణ సాయుధ పోరాటంలోనూ పాల్గొన్నారని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యులుగా, పొలిట్ బ్యూరో సభ్యులుగా పనిచేశారని అన్నారు. 1962లో వేమూరు నియోజకవర్గం నుండి, 1978 రేపల్లె నియోజకవర్గం నుండి సిపిఎం అభ్యర్థిగా గెలిచి పేదల పక్షాన అసెంబ్లీలో గళం వినిపించారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.పురుషోత్తం, ఎ.వీరబ్రహ్మం, పి.ప్రభాకర్, జి.సుసులోవ్, ఎం.జగన్నాథరావు, పి.సూర్యప్రకాశరావు, షేక్ సిలార్ మసూద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక పండరిపురంని సిపిఎం కార్యాలయంలో కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు బి.శంకరరావు మాట్లాడుతూ 1978లో యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో రాజకీయ శిక్షణా తరగతుల కోసం వచ్చినప్పటి సందర్భాలను గుర్తు చేశారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ జీవితాంతం పేదల కోసం పాటుపడ్డారన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణతో కలిసి పని చేసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.బాబు, ఎం.విల్సన్, పి.భారతి, బి.లక్ష్మణ్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని పిఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సభకు సిపిఎం మండల కన్వీనర్ టి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి సీనియర్ నాయకులు ఎస్.తులశయ్య, పి.సుబ్బారావు పూలమాలలేసి నివాళులర్పించారు. కె.రోశయ్య, జె.శంకరరావు, గురుస్వామి, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చే పుస్తకాలను అందించండి

ప్రజాశక్తి-గుంటూరు : సమాజం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తులు, సామాజిక బాధ్యతను తలకెత్తుకున్న రచయితలు రాసే పుస్తకాలను గ్రంథాలయాల్లో వుంచితే అవి చదువుకున్న పాఠకులు కూడా గొప్ప వ్యక్తులుగా రూపొందుతారని, కావున కవులు, రచయితలు మంచి పుస్తకాలను లైబ్రరీలకు అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు పిలుపునిచ్చారు. ఆదివారం గుంటూరు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లా శాఖ- బాపు రమణ బాలు కళాపీఠం నిర్వహించిన కవిమిత్రుల సంగమం - కవి సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కవులు, రచయితల్నే కాదు విద్యార్థుల్ని, వారి తల్లిదండ్రుల్ని కూడా గ్రంథాలయానికి రప్పించేందుకు గ్రంథాలయ వ్యవస్థలో కొత్త కొత్త ప్రణాళికలతో ముందుకు పోతున్నామన్నారు. కోట లీలాకృష్ణ రచించిన 'బ్రతుకు బాణీలు' నానీల పుస్తకాన్ని ఒఎస్‌డి టు చీఫ్ విప్ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, సుప్రసిద్ధ రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్ ఆవిష్కరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో గొప్ప ప్రక్రియగా పేరొందిన 'నానీ'లవెంట పడుతున్న 'గోపీ'లోలుర లిస్టులో లీలాకృష్ణ చేరిపోయారన్నారు. సభకు అధ్యక్షత వహించిన బాపు రమణ బాలు కళాపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ తొలి పుస్తకంగా నానీలను ప్రచురించిన లీలాకష్ణను అభినందించారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ కొత్త కవుల్ని ప్రోత్సహించి, సమాజంలో వారికి ఉన్నత స్థానాన్ని కల్పించాలనే గొప్ప లక్ష్యంతో ప్రతీ నెలా కవిమిత్రుల సంగమం-కవిసమ్మేళనం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 'బ్రతుకు బాణీలు' నానీల పుస్తకాన్ని కవి, రచయిత లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం సమీక్షించారు. అనంతరం సయ్యద్ జానీబాషా నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆళ్ళ నాగేశ్వరరావు, కారంచేటి విజరు కుమార్, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, డాక్టర్ బలరామ్ పెరుగుపల్లి, పింగళి భాగ్యలక్ష్మి, చల్లా సత్యవతి, సౌపాటి ప్రభాకర్, గడల శివప్రసాద్, వెదుళ్ళపల్లి సాంబశివరావు తమ కవితల్ని వినిపించారు. కనగాల జయకుమార్ రాసిన కవితకు ఉత్తమ బహుమతి ప్రకటించి, నగదు బహుమతితో సత్కరించారు.

మాస్టర్ స్కేల్ రూపకర్త వెంకటేశ్వరరావ వర్ధంతి

ప్రజాశక్తి-తెనాలి : ఉద్యోగలు, ఉపాధ్యాయులు, పెన్షన్‌దారుల సమస్యలపై పాలడుగు వెంకటేశ్వరరావు అలుపెరుగనవి పోరాటం చేశారని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రామకృష్ణమూర్తి అన్నారు. పిఆర్‌సి బ్రహ్మగా పేరొందిన వెంకటేశ్వరరావు వర్ధంతిని ఆదివారం స్థానిక కొత్తపేటలోని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రామకృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో పనిచేసిన ఆయన మాస్టర్ స్కేల్ రూపకర్తన్నారు. ఉద్యోగుల పిఆర్‌సి, వారి ప్రతి సమస్యపై వెంకటేశ్వరరావు ఎంతో శ్రమించారని కొనియాడారు. తొలుత వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

నేడు 'స్పందన' రద్దు

ప్రజాశక్తి-గుంటూరు సిటి

నేడు జిల్లాలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న కారణంగా సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆదివారం గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్ తెలిపారు. జిల్లా అధికారులు బందోబస్తు డ్యూటీ ఉండడం వలన స్పందనను రద్దు చేశామని, సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యలను తెలియజేయడానికి వచ్చే ప్రజలు ఈ విషయం గమనించాలని కోరారు.

వృద్ధురాలు ఇంట్లో చోరీ

ప్రజాశక్తి- గుంటూరు సిటి

స్థానిక కృష్ణానగర్ లో నివాసం ఉంటున్న ఒంటరి వృద్ధురాలు మెడలో నుండి గొలుసు తో పాటు గాజులని దొంగిలించుకుని వెళ్ళిన ఘటన స్థానిక పట్టాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివార తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 70 సంవత్సరాలు వయస్సు గల తాళ్లూరి వరలక్ష్మి, కృష్ణానగర్ 9 వ లైన్ లో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఆదివారం తెల్లవారు జామున 4 గంటలకు నీళ్ల మోటర్ వేసేందుకు బయటకు వచ్చి మోటార్ ఆన్ చేసి ఇంట్లోకి వెళుతున్న సమయంలో ఇంటి గోడ మాటున దాగి ఉన్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులను చూసి ఆమె అరిచింది. ఇంతలో వరలక్ష్మి నోరును బలవంతంగా మూసిన గుర్తుతెలియని వ్యక్తులు, ఆమె మెడలో ఉన్న బంగారపు చైన్‌తో పాటు చేతికి ఉన్న నాలుగు గాజులను లాక్కొని, ఆమెను పక్కకు నెట్టి పరారయ్యారు . కొంత సమయానికి పైకి లేచి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా అప్పటికే ఇంటిలో ఉన్న బీరువాను పగలగొట్టి అందులో ఉన్న బంగారం, వెండి వస్తువులతో పాటు కొంత డబ్బు లను వారు అపహరించినట్లు వరలక్ష్మి గుర్తించింది. దొంగిలించిన వాటి విలువ సుమారు రెండు లక్షల రూపాయలు ఉంటుందని వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పట్టాభిపురం పోలీసులు తెలిపారు.



కొనసాగిన టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రబాబు అరెస్ట్ ని ఖండిస్తూ గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇంచార్జి నసీర్ మొహమ్మద్ ఆధ్వర్యంలో సంజీవయ్య నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సి సెల్ ఆధ్వర్యంలో ఆదివారం రిలే నిరాహార దీక్ష లు నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో గుంటూరు ఎత్తు రోడ్డు సెంటర్‌లో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, డేగల ప్రభాకర్ జనసేన నాయకులు నాయబ్ కమల్, నేరెళ్ల సురేష్, వడ్రణం మార్కండేయులు,కన్నా రజిని దీక్షలకు సంఘీభావం తెలిపారు.తెనాలిలోని స్వరాజ్ టాకీస్ కూడలి, రూరల్ గ్రామం అంగలకుదురులో టిడిపి శ్రేణులు చేపట్టిన నిరసన దీక్షల్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. అధికారం చేజారుతుందన్న భయంతోనే చంద్రబాబునాయుడిని కేసుల్లో ఇరికించారని, ఏది ఏమైనా త్వరలోనే చంద్రబాబు ఖచ్చితంగా బయటకు వస్తారని ఆలపాటి అన్నారు. మంగళగిరిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో టిడిపి మైనార్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, టిడిపి గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని గొట్టిపాడులో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ బి.రామాంజనేయులు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కోడూరి అఖిల్, తెలుగు యువత శిఖ నవీన్ మాట్లాడారు. విజయపురి సౌత్‌లోని డౌన్ మార్కెట్ నుంచి సీఎం జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు రంగప్రవేశం చేసి ర్యాలీ ని అడ్డుకొని టీడీపీ నేతలను చెదరగొట్టారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ మాచర్ల మండల అధ్యక్షుడు నేరేటి వీరస్వామి యాదవ్, విజయపురి సౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి,ఎరిపల్లి వెంకటేశ్వర్లు,మైలపల్లి అప్పలరాజు, వస్తుపురి శ్రీరామూర్తి,గొట్టిముక్కల బాబు, బాబుఖాన్, అడెపు కోటయ్య, పంగులూరి అంజయ్య,స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.



మేయర్‌కు పీకలవాగు కట్ట ప్రజలు వినతి

ప్రజాశక్తి - గుంటూరు సిటి

పీకల వాగు వద్ద నివాసం ఉంటున్న 200 కుటుంబాలు ప్రజలు గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ను సంపత్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయనను ఆదివారం కలిశారు. ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్న తమ కొద్దిపాటిని స్థలాన్ని వదిలి మిగిలిన ప్రాంతాల్లో ఆధునికరణ చేసుకోవాలని మేయర్ ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నగరంలోని 20వ డివిజన్ పరిధిలోని పీకల వాగు కట్టను ఆక్రమించుకొని 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. పీకలవాగు ఆధునీకరణలో భాగంగా కొన్నిరోజుల క్రితం జిఎంసి అధికారులు సదరు స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మేయర్‌ను వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో 20వ డివిజన్ పార్టీ అధ్యక్షులు కంతేటి శ్యామ్ శేఖర్,ఖాజా మొహిదీన్, పాల్గొన్నారు.

న్యాయరక్షకులు న్యాయవాదులు: ఎమ్మెల్యే రోశయ్య

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

న్యాయ రక్షకులు న్యాయవాదులని పొన్నూరు శాసన సభ్యులు కిలారి వెంకట రోశయ్య అన్నారు. ఆదివారం పొన్నూరులో ప్రముఖ హైకోర్టు న్యాయవాది బండారు రాధిక (రూహి) కు చెందిన నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో న్యాయం, సమానత్వం, సాధికారతను పెంపొందించేందుకు న్యాయవాదులు కృషి చేస్తారని చెప్పారు. బండారు రాధిక తన కొత్త కార్యాలయం ద్వారా మరింతగా ప్రజలకు న్యాయ సేవ చేస్తూ, న్యాయం కోసం పోరాడేందుకు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ దాసరి నారా యణరావు, జిల్లా రైతు అభివద్ధి కమిటీ సభ్యులు బొద్దులూరి రంగారావు, నిడుబ్రొలు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైసీపీ యువ నాయకుడు అమిరినేని సాంబశివరావు, సీనియర్ నాయకుడు వట్టిప్రోలు రంగారావు, సీనియర్ న్యాయవాదులు తూమాటి రమేష్, డీ.రమేష్, మగ్బుల్ బేగ్, హై కోర్టు న్యాయవాది ఖాజా మోహినుద్దిన్, అర్ టీ ఐ యాక్టివిస్ట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయవాది బండారు రాధిక కు చెందిన నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - మాచర్ల

దుర్గి గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాచర్ల పట్టణానికి చెందిన దేరంగుల నాగరత్నం (61) మృతి చెందారు. బంధువులందరు కలిసి ఆటోలో అడిగొప్పల అమ్మవారి సన్నిధికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది . ప్రమాదంలో నాగరత్నం తలకు బలమైన గాయం కావడంతో మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దుర్గి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

మృతి కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని వెలవర్తిపాడులో ఒకే సామాజిక తరగతికి చెందిన దాయాదులు ఇరువర్గాల మధ్య గత గురువారం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఒక వర్గానికి చెందిన మన జాన్ రత్నం అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై మృతి చెందిన వ్యక్తి వర్గానికి చెందిన మన్నవ పుల్లయ్య మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసుకు సంబంధించి మరో వర్గానికి చెందిన మన్నవ చిన్నబాబు, మన్నవ భరత్ కుమార్, మన్నవ విజయ్ కుమార్, గుడి గుంట్ల ప్రేమ్ కుమార్ ,మన్నవ రాకేష్ ఐదుగురు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

నాగార్జునసాగర్ నుండి మాచర్ల వస్తున్న కారును మాచర్ల నుండి సాగర్ వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో కారులో ఉన్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి మాచర్లకు చెందిన షేక్ ఉమర్, షేక్ రియాజులు నాగార్జునసాగర్ వెళ్లి మాచర్ల వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఉమర్ కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలించారు.

మంచి సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న విఆర్ అపార్టుమెంట్స్



ప్రజాశక్తి-తాడేపల్లి

మట్టి వినాయకునితో వినాయకచవితి వేడుకలు నిర్వహిస్తూ ఈ ప్రాంతంలో ఓ మంచి సంప్రదాయాన్ని విఆర్ అపార్టుమెంట్, వజ్ర రెసిడెన్సీ అసోసియేషన్ నిర్వాహకులు కొనసాగిస్తున్నారని బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్, విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ అభినందించారు. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం విఆర్ అపార్టుమెంట్స్‌లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అపార్టుమెంట్‌లోని బాలబాలికలు తమ నైపుణ్యాలను ప్రదర్శించి అందరి మన్ననలను పొందారు. ఈ సందర్భంగా వజ్ర రెసిడెన్సీ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో మురళీకృష్ణ మాట్లాడుతూ ప్యారిస్ట్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల నీరు కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో మార్పులు రావడానికి కూడా కారణమవుతుందని చెప్పారు. సెప్టెంబర్ చివరికొచ్చినా వేసవి కాలాన్ని తలపిస్తున్న ఎండలు వస్తున్నాయంటే ఓజోన్ పొర దెబ్బతినడమేనన్నారు. పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ సంరంక్షించాల్సిన అవసరముందన్నారు. పండుగల స్నేహపూరిత వాతావరణంలో కులమతాలకు అతీతంగా జరగాలని ఆకాంక్షించారు.

విఆర్ అపార్టుమెంట్స్‌లో అటువంటి సంప్రదాయం కొనసాగడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణతో పాటు ఎంటిఎంసి బాలోత్సవం గాదె సుబ్బారెడ్డిని శాలువాతో సత్కరించా మెమెంటో అందజేశారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వజ్ర రెసిడెన్సీ అసోసియేషన్ సెక్రటరీ బుర్రముక్కు శివారెడ్డి, విశ్రాంత బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి వల్లయ్య, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.



CHANGE OF NAME

I, KOKKU SHESHU KUMARI W/O KOKKU KRISHNA MOHAN, R/o. D.No: 7-79, Lingamguntla, Narasaraopet Town, Palnadu District. I do hereby state that My original name is KOKKU SHESHU KUMARI. (After marriage).The same name is mentioned in my AADHAR CARD & in my SSC Marks Memo my name is mentioned as SESHU KUMARI THOTA (Before marriage). The Both names are belongs to me. **Two names are one and same** only.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, SATTENAALLI I.A. 540/2023, I.A. 541/2023 and I.A.No. 542/2023 in OS No. 299/2016

Between :
Kantamaneni Narasimha Rao (died)
Gogineni Jalajakshi
... Petitioner / 2nd plaintiff
And
Meduri Srinivasa Rao & Others
... Respondents / Defendants

To,
R4 : Kurra Padmavathi, W/o Ravindra Babu, R/o Epuru Village, Kolluru Mandal, Guntur District.

పై నెంబరు వారసుల I.A.No. 542/2023 పిటీషన్, I.A. 541/2023 అబెట్‌మెంట్ ఆర్డర్‌ను రద్దుపరచమని మరియు I.A. 540/2023 సెక్షన్ 5 పిటీషన్‌లలో ఆర్4 రెస్పాండెంట్‌కు నోటీసు నిమిత్తం ది. 30-10-2023 వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనియెడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదాతేది: 30-10-2023

నోట్ : ఈ ప్రకటన దాఖలు చేయు నిమిత్తం ది. 25-9-2023 వాయిదా వున్నది.

జి.సీతారామిరెడ్డి,
పిటీషనర్ తరఫు అడ్వకేట్, గుంటూరు.

నేటి బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దళిత హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం ఈ నెల 25 వ తేదీన కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చిలకలూరిపేట నియోజకవర్గము లోని గ్రామాల్లో కూడా బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు కె.వి.పి.ఎస్. పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.విల్సన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సాతులూరి లూథర్ సంయుక్తంగా తెలిపారు. స్థానిక పండరీపురంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న పేద, ప్రతి దళిత కుటుంబానికి మూడు సెంట్లు ఇంటి స్థలం, రెండు ఎకరాలు సాగు భూమిని పంపిణీ చేయాలని, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని అన్నారు. బైక్ ర్యాలీ ద్వారా ప్రచారం చేస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తామని చెప్పారు. అంతే కాకుండా ఆయా గ్రామాల్లో దళితులకు ఉన్న స్థానిక, భూ సమ స్యలను వినతి పత్రాలు రూపంలో తీసుకుంటామని అన్నారు.ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న విజయవాడలో జరిగే మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్య క్రమంలో సిఐటియు నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు, సాతులూరి బాబు, ప్రభాకరరావు, హనుమంతరావు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేత

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు మంత్రి అంబటి రాంబాబు ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో చెక్కులను అందజేశారు. ఐదు కుటుంబాలకు రూ.8.45 లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో లేని వ్యాధుల బారిన పడి మృతి చెందిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొంత మేరకు ఊరట కల్గిస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ విలేజ్ క్లినిక్స్ ను ఏర్పాటు చేసిందని చెప్పారు. దీని వలన ప్రతి ఇంటికి వైద్యులు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు.



పొందుగులలో ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి- దాచేపల్లి

మండలంలోని పొందుగులలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఆదివారం ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఆంధ్ర తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న పొందుగుల ఎంతో ముఖ్యమైందన్నారు. ఈ ప్రాంతంలో స్థలాలకు అధిక రేట్లు ఉంటాయని చెప్పారు. ప్రభుత్వం.. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల పట్టాల పంపిణీ చేసిందని చెప్పారు.

మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఉధృతి

- దిగుబడులపై తీవ్ర ప్రతికూల ప్రభావం
- ఆందోళన చెందుతున్న రైతులు
- విత్తన శుద్ధి ద్వారా కట్టడి చేయొచ్చు
- జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ. మురళి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

గత మూడు నాలుగేళ్లుగా మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు వ్యాప్తి చెంది తీవ్రమైన నష్టాలు వచ్చాయి. అయితే, గత ఏడాది కత్తెర పురుగును నివారించి, అధిక దిగుబడి లభించింది. ఈ అనుభవం దృష్ట్యా ఈ ఏడాది ఆరుతడి పంటల సాగుకు ముందుకు రావాలని సూచించిన నేపథ్యంలో పల్నాడు జిల్లాలోని రైతులు మొక్కజొన్న వైపు మొగ్గుచూపుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమగ్రమైన యాజమాన్య చర్యలను పాటించినప్పటికీ కత్తెర పురుగును



కత్తెర పురుగు సోకిన పంటను చూపిస్తున్న రైతు బోయపాటి సాంబశివరావు

అదుపు చేయలేకపోయామని రైతులు చెబుతున్నారు.

విత్తన శుద్ధి, సమగ్ర యాజమాన్య చర్యలు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు మేరకు సాగు చేస్తే మొక్కజొన్న పంటను తినేసే కత్తెర పురుగును కట్టడి చేయవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. దిగబడులపై తీవ్ర ప్రభావం చూపే కత్తెర పురుగును పూర్తిగా నియంత్రవచ్చని అంటున్నారు. ముఖ్యంగా మొలక తర్వాత రెండు నుంచి మూడు వారాల లోపు కత్తెర పురుగును పూర్తిగా నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని, ఇందులో ప్రధానంగా విత్తన శుద్ధి తప్పనిసరి అని సూచిస్తున్నారు. ఆఫ్రికా దేశాలలో పుట్టి పంటలకు తీవ్ర నష్టం కలిగించిన లెపిడప్పరస్ జాతికి చెందిన కత్తెర పురుగు భారతదేశంలో 2018 లో తొలిసారిగా కర్ణాటక రాష్ట్రంలో మొక్కజొన్న పైరు పై దాడి చేసిందని ఆ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాలకు కూడా వ్యాపించిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కత్తెర పురుగును నియంత్రించేందుకు కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రత్యేక దృష్టి సారించి రైతులు అప్రమత్తం చేస్తున్నప్పటికీ కత్తెర పురుగును అదుపు చేయడంలో వైఫల్యం చెందినట్లు అధికారులు చెబుతున్నారు. మొక్కజొన్న సాగుకు సం బంధించి విత్తన శుద్ధి మొదలుకొని పంట చేతికి వచ్చేవరకు సస్య రక్షణ చర్యలు పాటించాలని భారతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు సూచిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వ్యవసాయ శాఖాధికారులు సూచనలు తప్పక పాటించాలి

మొక్కజొన్న పంటను సాగు చేసే రైతులు కత్తెర పురుగు ఉధృతిపై తొలి నుండి జాగ్రత్తలు పాటించాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన ప్రకారం విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయించుకోవాలి. పంట చేతికి వచ్చే వరకు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. కత్తెర పురుగు నివారణ చర్యలపై ఇప్పటికే రైతులకు అన్ని విధాలుగా అవగాహన కల్పించామని, నివారణ పద్ధతులు పాటిస్తే కత్తెర పురుగును నియంత్రించే అధిక దిగుబడులు పొందవచ్చని చెబుతున్నారు.

నియంత్రణకు చేపట్టాల్సిన యాజమాన్య చర్యలు

కత్తెర పురుగు నియంత్రణకు తొలి నుండి జాగ్రత్తలు పాటించాలి. ఇందుకోసం ఇమిడాక్లోప్రిడ్ 1 కేజీ విత్తనానికి 0.6 గ్రాములతో విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తన శుద్ధి చేయ డం వలన మొలక తర్వాత 21 రోజుల లోపు కత్తెర ,ఇతర చీడలు పురుగు ఉధృతిని నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది. విత్తనం వేసిన వారం లోపు లీటర్ నీటికి 0.5 ఎం.ఎల్ వేపనూనె పంటపై పిచికారి చేస్తే



లద్దె పురుగును పోలి ఉన్న కత్తెరపురుగు

కత్తెర పురుగు లార్వా దశలోనే నిర్మూలించేందుకు అవకాశం ఉంటుంది. పంట పెరిగే కొద్ది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. కత్తెర పురుగు ఆశించినట్లయితే లీటరు నీటిలో 0.5 గ్రాముల హిమామెక్టిన్బెంజెట్ మందును పిచికారి చేయడం వలన ఉధృతిని నివారించవచ్చు. పంట 30 రోజుల వయ సులో ఉన్నప్పుడు ఎకరాకు 10 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా కత్తెర పురుగు నియంత్రణకు ఉపయోగపడుతుంది. 10 కిలోల ధాన్యం తవుడు, 2 బెల్లం, 2 లీటర్ల నీటిని కలిపిన మిశ్ర మాన్ని ఒక రాత్రి ఉంచి ఉదయం 100 గ్రాముల థయో డికార్బ్ ముందును కలిపి పొలంలోని మొక్కలకు సుడిలో వేయడం వల్ల కూడా ఈ పురుగు నశించే అవకాశం ఉంటుంది. పంట చేతికి వచ్చే వరకు కత్తెర పురుగు విషయంలో రైతులు జాగ్రత్తలు తీసు కోవాలని అన్నారు. గత ఏడాది పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఈ సమ యానికి 460 హెక్టార్లలో మొక్కజొన్న సాగు అయిం దని ఈ ఏడాది ఇప్పటికి 163 హెక్టార్లలో సాగయిందని ఆయన చెప్పారు. మొక్కజొన్నకు అక్టోబర్ మంచి అదును అని, అయితే సాగర్ జలాలపై ఆధారపడి కాకుండా నీటి వనరులు ఉన్న రైతులు సాగు చేస్తే లాభసాటిగా ఉంటుందని చెప్పారు.



జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి



కత్తెర పురుగు నివారణకు మోములో గుళికలు వేస్తున్న కూలీలు

విద్యార్థిని వాజిత కుటుంబాన్ని ఆదుకోండి

- వాజిత చెల్లెలుకి ప్రభుత్వం ఉద్యోగమివ్వండి
- ఎంఎంజి నుంచి ఆసిస్టు వరకు తరచుగా రోడ్డు ప్రమాదాలు
- గతంలో పలువురు మృతి
- అతివేగానికి పెనాల్టీలు వేయండి
- అధికారులు తగు చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పురుషోత్తపట్నం అడ్డరోడ్డు సెంటర్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థిని వాజిత మరణించడం దురదృష్టకరమని సిపిఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు ఆదివారం అన్నారు. స్థానిక పండరీ పురంలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రమాదానికి గురైన మరొక విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరులో చికిత్స పొందుతున్నాడని, త్వరగా కోలుకోవాలని అన్నారు. వాజిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. వాజిత చెల్లెలుకి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని, వారికి సొంత ఇల్లు లేకపోతే వెంటనే స్టలం కేటాయించి ఇల్లు కట్టించి ఇవ్వాలని అన్నారు. పట్టణంలో ఒంగోలు-గుంటూరు, గుంటూరు-ఒంగోలుకు వెళ్లే జాతీయ రహదారిపై ఎఎంజి నుంచి ఆసిస్టు వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆ ప్రాం తంలో వాహనాల వేగం 30,35 కిలోమీటర్ల కంటే మించకుండా ఉండేలా చర్యలు తీసుకోవా లని కోరారు. పట్టణంలో ఆసిస్టు కార్యాలయమ నుంచి (అడ్డరోడ్డు, విజయ బ్యాంక్,ఎన్. ఆర్. టి. సెంటర్,బస్ స్టాడ్,) ఎఎంజి వరకు రేడియం స్టికర్లు ఏర్పాటు చేయాలని,బారికేడ్లు ఒక్క విజయ బ్యాంక్ వద్దే కాకుండా పలు చోట్ల ఉంచాలని,సిసి కెమెరాలు, అతివేగానికి ఆటో మాటిక్ పెనాల్టీలు పడేలా చేయాలని సూచించారు.

గతంలో విజయ బ్యాంక్ సెంటర్‌లో ఓ మహిళ రోడ్డు దాటుతూ లారీ ఢీ కొట్టిన ఘటనలో మృతి చెందిందని, ఇంటర్ మీడియట్ పరిక్షలు రాసేందుకు వెళ్లే విద్యార్థి ఎఎంజి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనల గురించి ఆయన ప్రస్తావించారు. ఆర్‌టిసి బస్టాండ్ వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారికి ప్రభుత్వం స్పందించి ఒకొక్కక్కరికి రూ. 25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని, గాయాలైన వారికి రూ.2 లక్షలు ఇవ్వాలని,ఆసుపత్రి ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన విద్యార్థుల విషయంలో వారు నష్టపోయిన విద్య సంవత్సరాన్ని విద్య శాఖ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలివ్వాలి

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. వడ్డేశ్వరంలోని కెబి భవన్‌లో తాడేపల్లి మండల మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుల విస్తృత సమావేశం సిఐటియు నాయకులు ఎన్.కిషోర్‌బాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పనిచేస్తున్న ఆయా గ్రామాల పారిశుధ్య కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. చట్ట ప్రకారం రూ.15 వేల వేతనం, రూ.6 వేల హెల్త్ అలవెన్స్ మొత్తం రూ.21 వేలు ఇవ్వాల్సి ఉండగా, రూ.12-15 వేలే ఇవ్వడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి నివాసానికి కూత వేటు దూరంలో ఉన్న గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా అందడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. పేదల ప్రభుత్వం అని చెప్పుకునే ముఖ్యమంత్రి దళితులు, గిరిజనులు, పేదలు పనిచేసే మున్సిపల్ రంగంలో చేసిన పనికి సమాన వేతనం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. పారిశుధ్య కార్మికుల చేత వెట్టి చాకిరి చేయించుకొని కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. కనీస సౌకర్యాలైన సబ్బులు, నూనెలు, కాళ్లకు చెప్పులు, శానిటైజర్స్ కార్మికులకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం 15 మందితో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల తాడేపల్లి మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చొక్కా మరియదాసు, ఉపాధ్యక్షులుగా గాజుల పిచ్చయ్య, కంచర్ల క్రాంతి, కార్యదర్శిగా మేకల డేవిడ్, సహాయ కార్యదర్శులుగా వంశీకృష్ణ, కృష్ణ తులసి, సరోజినీ, కోశాధికారిగా మారయ్య, మరో ఏడుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, సిఐటియు నాయకులు డి.వెంకటరెడ్డి, కౌలురైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పి.కష్ణ, మున్సిపల్ కార్మికులు నాగరాణి, వెంకటేశ్వర్లు, కోటేశ్వరి, సాంబయ్య పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా రక్తదానం, వస్తుదానం..



రక్తదానం చేసిన విద్యార్థినులను అభినందిస్తున్న డిఎంఅండ్‌హెచ్ఒ, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్ఎస్ఎస్ డేని పురస్కరించుకొని స్థానిక ఆకులవారితోటలోని మెడికల్ కాలేజి గరల్స్ హాస్టల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎం అండ్ హెచ్ఒ) ఎ.శ్రావణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఒ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆయుష్మాన్‌భవ సేవ పక్వాడ అనే కార్యక్రమం ద్వారా బ్లడ్ డొనేషన్స్ ఆవశ్యకతను తెలియజేస్తూ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లో రక్తదాతల ద్వారా 700 యూనిట్ల బ్లడ్ సేకరించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నివారణ అధికారి డాక్టర్ బి.లక్ష్మానాయక్ భూక్య, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎల్.మధుసూదన్‌రావు, సీనియర్ సూపర్‌వైజర్ వీరస్వామి, ఆఫీసు అకౌంటెంట్ శ్రీనివాసరాజు, శ్రీవిద్య, జిజిహెచ్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

మలినేనిలో ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే

స్థానిక పుల్లడిగుంటలోని మలినేని మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రోటరీ ఆర్ఐ-3150 జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ముప్పాల సుబ్బారావు, జిల్లా చైర్ పాటిబండ్ల శివరంజని పాల్గొన్నారు. శివరంజని మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగం, ఉపాధితోపాటు సమాజ సేవలో భాగంకావాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. భవిష్యత్‌లో రోటరీ, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా మరిన్ని కార్యక్రమాలు చేపడదామని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ హెడ్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ జెఎన్‌టియు నుండి ఎన్ఎస్ఎస్ తరపున చేస్తున్న అన్ని కార్యక్రమాలకూ ఆర్థికంగా, అన్ని రకాలుగా మంచి ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. సమాజ సేవలో భాగస్వాములు అవుతున్న విద్యార్థులను కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు అభినందించారు.



స్వీపర్లకు నిత్యాసరాలను అందిస్తున్న టిజెపిఎస్ కాలేజీ ప్రిన్సిపాల్

మన చుట్టూ ఉన్న పేదలకు సాయం చేయండి

జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్థానిక టిజెపిఎస్ కాలేజీలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్ మాట్లాడుతూ విద్యాసంస్థలలో విద్యతో పాటుగా సేవా గుణం, నాయకత్వ భావం, మానవీయ విలువలు, దేశభక్తి వంటి అంశాలు అలవడుతాయని, అంతే కాకుండా విద్యార్థులలో సేవా దృక్పథం, దేశ పునర్నిర్మాణ కృషి పట్ల ఆసక్తి అలవడుతుందని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి సమాజసేవలో పాలుపంచుకోవాలని సూచించారు. ఎక్కడో ఉన్నటువంటి వారికి సహాయం చేయటానికి ఎదురు చూడకుండా మీ చుట్టూ, మీ పక్కనే ఉన్నటువంటి పేద వారిని గమనించి సహాయం చేయాలన్నారు. అనంతరం నేషనల్ ఇంటిగ్రెషన్ క్యాంపునకు వెళ్లి వచ్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. కళాశాలలో పని చేస్తున్న స్వీపర్లకు ఎన్ఎస్ఎస్ పూర్వ విద్యార్థులు బియ్యం, కందిపప్పు తదితర నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో గుంటూరు ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్. జె.వి.సుధీర్ కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఆర్.జయశైలజ, ఆర్.స్వామి, కె.శ్రావణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విద్యతోపాటు సేవా దక్పథం అలవర్చుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ స్టూడెంట్ ఎఫైర్స్ డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు సూచించారు. ఆదివారం ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా మొదటి సంవత్సరం విద్యార్థులకు వర్సిటీలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్ఎస్-ఎస్‌తో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడుతాయని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి. శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. 1969లో అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు జరగటం అభినందనీయమని డీన్ అడ్వైజర్ డాక్టర్ హబీబుల్లాఖాన్ అన్నారు. వాలంటీర్లు గ్రామాల్లోని ప్రజలతో మమేకం కావడం వలన వారి జీవన స్థితిగతులను తెలుసుకోటం ద్వారా సామాజిక స్పృహ ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సాక్ డైరెక్టర్ పి.సాయివిజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ రూతురమ్య, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ పాల్గొనగా సమన్వయకర్తలుగా పి.సురేష్, జి.చంద్రశేఖర్ వ్యవహరించారు.



ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అభినందిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

రోగం వచ్చిన తర్వాత కంటే రాకుండా జాగ్రత్తలు తీసుకోవటం ఉత్తమం అని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. ఆదివారం రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్య మెలకువలు నేర్చుకోవాలని, ప్రమాదాల్లో తీవ్ర గాయాలు అయినప్పుడు ప్రథమ చికిత్స ద్వారా ప్రాణాలు నిలపవచ్చుని చెప్పారు. రెడ్‌క్రాస్ ద్వారా ఏర్పాటు చేస్తున్న ప్రథమ చికిత్స శిక్షణ శిబిరాల్లో ప్రజలు పాల్గొని ఆరోగ్య భారత్ సాకారం చేయాలని డాక్టర్ శ్రావణ్‌బాబు పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారి ప్రమాదాలు జరిగి క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రథమ చికిత్స శిక్షణ ద్వారా క్షతగాత్రుల నుండి రక్తం ఎక్కువ పోకుండా నియంత్రించాలో తెలుస్తుందని అన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల్లో, పరిశ్రమల్లో కమ్యూనిటీ సెంటర్లలో బేసిక్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ ఏర్పాటు చేసి, ప్రజల్లో ఆరోగ్య చైతన్యం నింపడానికి రెడ్‌క్రాస్ పనిచేస్తుందని తెలిపారు. ఈ శిక్షణలో డాక్టర్ వీణాబాయ్, డాక్టర్ లక్ష్మీ సుశీరాణి రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. అనంతరం శిక్షణ పొందిన అభ్యర్థులకు జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జె.రఘుస్వర్ణ, మేనేజర్ పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ తదితరులు

జాషువా జయంతి సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చేబ్రోలు

గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా బుధవారం గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే జయంతి సభ జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు కరపత్రాలాను మండల కేంద్రమైన చేబ్రోలులోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జాషువా సాహితీ పురస్కారాన్ని రాచపాలెం చంద్రశేఖరరెడ్డికి ప్రదానం చేయనున్నారని, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, సత్యాజీ హాజరవుతారని తెలిపారు.



రక్తదానం చేసిన విద్యార్థులకు ధ్రువపత్రం ఇస్తున్న నిర్వాహకులు

50 మంది విజె విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - మంగళగిరి

విద్యార్థులు చదువుతోపాటు సామాజిక స్పృహ కలిగి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజె డిగ్రీ కళాశాల సెక్రటరీ-కరస్పాండెంట్ పి.రాజశేఖర్ అన్నారు. స్థానిక విజె డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్-1, 2 యూనిట్ల ఆధ్వర్యంలో ఆపద్బంధు సేవాసమితి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆదివారం రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే మరో మనిషికి ప్రాణం పోయడమేనని అన్నారు. విద్యార్థులు ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చుని, కుల, మత, ధనిక, పేద తేడాలు లేకుండా మనిషిని రక్తం కాపాడుతుందని చెప్పారు. ఆపద్బంధు సేవా సమితి అధ్యక్షులు జె.ఆంజనేయులు మాట్లాడుతూ రక్తదానం వల్ల ఇచ్చిన వారి ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావమూ ఉండదని, రక్తదానాన్ని అందరూ బాధ్యతగా భావించాలని కోరారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులు రక్తదానం చేయగా కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ జి.లక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎస్.శంకర్, సురేష్‌బాబు, ఆపద్బంధు సేవా సమితి సిబ్బంది పాల్గొన్నారు.

చలో అసెంబ్లీకి అనుమతి లేదు : ఎస్పీ

ప్రజాశక్తి - గుంటూరు సిటి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి ముఖ్య నాయకులు సోమవారం తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యముక్రమానికి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అనుమతులు లేవని గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదివారం తెలిపారు. పోలీస్‌శాఖ ఆదేశాలను ధిక్కరించి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు.



నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహాలు

ప్రజాశక్తి - అచ్చంపేట

అచ్చంపేట లోని అంకమ్మ తల్లి దేవాలయంలో వడియా రాజుల యువకులు ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం ఆదివారం నిమజ్జన చేశారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం పాట జరిగింది.

ఉపకులాల అభ్యున్నతికి కృషి చేయాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ఎస్సీ సామాజిక తరగతిలోని ఉపకులాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జిల్లేళ్లపాల్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గంలో సుమారు 20 ఉప కులాలు ఉన్నాయని, వాటి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉప కులాలు స్థితిగతులపై ప్రభుత్వం అధ్యయనం చేయాలని, జనాభా దామాషా లెక్కల ప్రకారం వారికి ఉప కులాల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు నిధులు కేటాయించాలని కోరారు. వారిని ఆర్థికంగా , రాజకీయంగా , సామాజికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు.

అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డికి అలేఖ్య ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాస రెడ్డికి విద్యారంగంలో విశిష్టమైన కృషి చేస్తున్నందుకు గాను 'అలేఖ్య ఐకాన్ అవార్డు2023' జాతీయ పురస్కారాన్ని శ్రీ సాయి అలేఖ్య సాంస్కృతిక సేవా సంస్థ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. వివిధ రంగాల్లో విశేషమైన సేవ చేసినందుకు ఇచ్చే ఈ అవార్డును, విద్యారంగంలో ఇరవై ఏడేళ్లుగా విశిష్ట కృషి చేస్తున్నందుకు గాను శ్రీనివాస రెడ్డికి ఈ పురస్కారాన్ని ఇచ్చినట్లు నిర్వాహకులు ఉపద్రష్ట అరుణ అశోక్ తెలిపారు. శ్రీనివాస రెడ్డిని పీసి చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి,పాఠశాల సిబ్బంది,గుంటూరు,పల్నాడు జిల్లాల ప్రధానోపాధ్యాయ సంఘ అధ్యక్షులు ఎ.తిరుమలేష్, ఆర్. శ్రీనివాస రెడ్డి,గ్రామ పెద్దలు, ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య, అభినందించారు.

మహిళా బిల్లు ఆమోదంపై హర్షం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మహిళా బిల్లు ఎట్టకేలకు ఆమోదం పొందడం హర్షణీయమని జనసేనపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కన్నా రజని అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం మహిళా సదస్సు నిర్వహించారు. నియోజకవర్గం నాయకులు బొర్రా వెంకట అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రజనీ మాట్లాడుతూ వైసిపిని భూస్థాపిత చేసి నారీశక్తిని చాటుతామని అన్నారు. క్రిష్ణా-పెన్నా మహిళా రీజనల్ కో-ఆర్డినేటర్ పార్వతీనాయుడు మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచాలన్న లక్ష్యంతో, మహిళా సాధికారతకు పట్టం కట్టాలన్న తలంపుతో ఎందరో చేసిన పోరాటాలు ఈనాటికి ఫలప్రదమవ్వడం సంతోషదాయకం అన్నారు. పాకనాటి రమాదేవి మాట్లాడుతూ ఇప్పటికైనా అన్ని రాజకీయపార్టీల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని, ప్రాధాన్యతను పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.

8న పల్నాడు కవితోత్సవం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 8న నరసరావుపేటలోని ప్రకాష్ నగర్ లోని భువన చంద్ర టౌన్ హాల్ లో 'పల్నాడు కవితోత్సవం కార్యక్రమం జరనుంది. ఈ విషయాన్ని శ్రీశ్రీ కళా వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి గుండాల రాకేష్ ఆదివారం తెలిపారు. పల్నాడు కవితోత్సవానికి సంబంధించి న వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భగా కళా వేదిక నిర్వాహకులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అభినందించారు. రాకేష్ మాట్లా డుతూ ఈ కవితోత్సవంలో భాగంగా జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పల్నాడు కళాక్షేత్రం నిర్వాహకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ అధ్యక్షులు కాల్వ రవి, శ్రీ శ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షురాలు ఎస్ శాంతి బాయి, ఉపాధ్యక్షు రాలు షేక్ సప్రున్నిస, అమర్, వైసిపి నాయకులు ఖాదర్ బాషా, రాజా, వంశీ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే,తదితరులు

రక్త దానానికి యువత ముందుకు రావాలి

- స్వచ్ఛందంగా రక్త దానం చేస్తే రూ.5 లక్షల ప్రమాద బీమా
- పల్నాడు బ్లడ్ బ్యాంక్ అధినేత కుర్రా జానకిరామయ్య

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, జాతిపిత మహాత్మా గాంధీ జయంతి ఉత్సవాల్లో భాగంగా 'సేవా పక్వాడ ' పేరుతో దేశవ్యాప్తంగా రక్త సేకరణ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో యువత మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రక్త దానం చేయాలని పల్నాడు బ్లడ్ బ్యాంక్ అధినేత, పునీత్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ కుర్రా జానకి రామయ్య అన్నారు.ఆదివారం బ్లడ్ బ్యాంక్ లో 10 మంది యువకులు రక్త దానం చేశారు. రక్త దానం చేసిన యువకులను బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు సత్కరించారు. జానకిరామయ్య మాట్లాడుతూ పల్నాడు బ్లడ్ సెంటర్ ద్వారా స్వచ్ఛందంగా రక్త దాతలకు రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నామని చెప్పారు.



రక్త దానం చేసిన వారికి ప్రమాద బీమా పత్రాన్ని అందజేస్తున్న కుర్రా జానకిరామయ్య

రక్తదానం చేయడం వలన ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలన్నారు. స్వచ్ఛందంగా రక్త దానం చేసే వారు తమ బ్లడ్ బ్యాంక్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



'ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని, విద్యాభివృద్ధి కోస ఉపాధ్యాయులతో పాటుగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు, శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్టీయు నూతన కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లడుతూ దేశంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రలలో కూడా సిపిఎస్ రద్దు చేయడం లేదని అలాంటిది ఈ రాష్ట్రంలో జిపిఎస్‌ను అమలు చేయడం హర్షనీయమన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై త్వరలోనే వారితో కలిసి చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు,మాజీ ఎమ్ఎల్‌సీ బాబురావు పాల్గొన్నారు.

జాషువా రచనలపై విశ్లేషణ

ప్రజాశక్తి-గుంటూరు సిటి

జాషువా జయంతి వారోత్సవాలలో భాగంగా మూడో రోజు నగరంలోని కన్నవారితోటలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో మహాకవి జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో జాషువా రచించిన ఖండ కావ్యం క్రీస్తు చరిత్ర పై వ్యాఖ్యనం, విశ్లేషణ కార్యక్రమం ఆదివారం జరిగింది. స్టాంప్స్ రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ రిటైర్డ్ డిఐజి ఎస్.బాలస్వామి అధ్యక్షతన ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం కార్డ్స్ సంస్థ డైరెక్టర్ యం. స్వర్ణలత పాల్గొని క్రీస్తు చరిత్ర కావ్యంపై వ్యాఖ్యనం, తులానాత్మక విశ్లేషణ చేశారు. కార్యక్రమంలో తెలుగు బాప్టిస్ట్ చర్చి కమిటీ చైర్మన్ పినపాటి నానా రావు , బాప్టిస్ట్ చర్చి ఫాదర్ గాబ్రియేల్ , హైకోర్టు న్యాయవాది గడ్డం ఎలీషా , వైయస్ఆర్. నాయకులు కాంగ్రెస్ అతోట జోసెఫ్ కుమార్ , జాషువా కళాపీఠం కార్యదర్శి నూతక్కి సతీష్ పాల్గొన్నారు.

8 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని గేటు సెంటర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 8 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్రజలు పెద్ద ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమానికి తరలివచ్చారు. నిర్వాహకులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, కళ్లం రాజ శేఖరరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో..

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో ఆదివారం దేవస్థాన అన్నప్రసాద భవనం నందు భక్తులకు నిత్య అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర్ రావు పాల్గొని భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. పాలకమండలి సభ్యులు గుమ్మళ్ళ వెంకట్రావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొండూరు, చామర్రులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - అచ్చంపేట

మండల పరిధిలోని కొండూరు, చామర్రులలో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండూరులో రూ.20 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు నూతనంగా మంజూరైన వంద గృహాలకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. గతంలో 390 ఉన్న పెన్షన్లు 600కు పైగా లబ్ధిదారుల ప్రతినెలా లబ్ధి పొందుతున్నారని అన్నారు. దారుణంగా ఉన్న కొండూరు , నిండుజర్ల దొడ్లేరు గ్రామాలకు తారు రోడ్డు ఏర్పాటు చేశామని, సుమారు రెండు కోట్లతో జలజీవన్ మెషిన్ కింద తాగునీటి ఏర్పాట్లు చేశామన్నారు.

చామర్రులో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గడపగడపకు కార్యక్రమాల్లో వచ్చిన ఫిర్యా దులను ఏ మేరకు పరిష్కరించారో ఆయన అడిగి తెలుసు కున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకొని వాటి పరిష్కారానికి 'మీకోసం శంకరన్న 'గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
సోమవారం 25 సెప్టెంబర్ 2023

సరైన దిశలో లక్ష్యం వైపు పయనించడం నేర్పాలి

- మార్కులు, ర్యాంకులపై ఉన్న శ్రద్ధ నైపుణ్యాలు నేర్పడంపై లేదు
- ప్రైవేటు పాఠశాలల ఏర్పాటులో నిబంధనలను సడలిస్తాం
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్


సభలో మాట్లాడుతున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విద్యార్థులకు వేగంగా లక్ష్యాన్ని చేరుకోవడం నేర్పడం కంటే ముందు వారిని సరైన దిశలో లక్ష్యానికై పయనించడం ఎలాగో నేర్పాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో జరిగిన ఎపి ప్రయివేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్ (అపుస్మ) సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రయివేటు పాఠశాలల యజమానులు, ఉపాధ్యాయులకు, తల్లి దండ్రులకు పలు రకాల సూచనలు చేశారు. బీటెక్, ఎంటెక్ చదివిన వారు సైతం ప్రభుత్వ శాఖల్లో అటెండర్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవడం రాష్ట్ర విద్యావ్యవస్థను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. అటు తల్లి దండ్రులు, ఇటు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల ర్యాంకుల పైన, మార్కుల పైన పెడుతున్న శ్రద్ధ విద్యార్థులకు నైపుణ్యాలను నేర్పాలనే కోణంలో ఆలోచించడంలేదని అన్నారు. రానున్న కాలంలో విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులను తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, అందుకోసం ప్రయివేటు పాఠశాలలు సైతం తమకు సహకరించాలని కోరారు. విద్యార్థులకు వేగంగా అభివృద్ధి చెందడం నేర్పడం కంటే ముందు వారిని సరైన దిశలో పయనించేలా దిశా నిర్దేశం చేయడం ముఖ్యమన్నారు. గత తరం పిల్లలో పోల్చుకుంటే ఈ తరం పిల్లలు ఎంతో చురుకైన వారన్నారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే ఎక్కువ శాతం వసతులు ఉన్నయాని, అయినా తల్లిదండ్రులు ప్రయివేటుకే ఎక్కువ మక్కువ చూపడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని అన్నారు. ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుకు గతంలో ఉన్న కఠినమైన నిబంధనలను సడలిస్తామని హామీ ఇచ్చారు. ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ అనుమతుల కోసం ధరఖాస్తు చేసుకునే విధానాన్ని అమలులోకి తెచ్చినట్లు తెలిపారు. అనుమతుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగవలసిన దుస్థితికి ఇక స్వస్థి పలకనున్నామన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన అపుస్మ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బస్సుల ట్యాక్సులు, వంటి పలు రకాల సమస్యలను ప్రస్తావించారు. ప్రధాన కార్యదర్శి కె.తులసి విష్ణుప్రసాద్ మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రయివేటు పాఠశాలలకు రాష్ట్రంలో అనువైన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. మిగిలిన సమస్యలను కూడా తమ తరుపున ఎన్నికయిన ఎమ్మెల్సీల ద్వారా ప్రభుత్వానికి విన్నవిస్తామని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించిన అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పుట్టా సాయి శ్రావణి, ద్వితీయ స్థానం స్థానం రాజమండ్రికి చెందిన నాగసాయి నవ్యశ్రీ, మూడవ స్థానం వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన షేక్ రజితా పాతిమాలతో పాటు మరో తొమ్మిది మందిని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు టి.కల్పలత, ఎం.వి.రామచంద్రారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంబిఎస్.శర్మ, ఎంవి.రావు, నిషా అధ్యక్షులు కుల్భుషన్ శర్మ, కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న డాక్టర్ గణేశుని రాజేష్

క్యాటరాక్ట్‌కు ఆధునిక వైద్యం

ప్రజాశక్తి-గుంటూరు : క్యాటరాక్ట్‌కు ఆధునాతన పద్ధతుల్లో వైద్యం అందుబాటులోకి వచ్చిందని, ఆపరేషన్ చేసిన వెంటనే రోజువారీ పనులకు హాజరవ్వొచ్చని సుదర్శన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ గణేశుని రాజేష్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో ఆయన పాల్గొని క్యాటరాక్ట్, నీటికాసుల గురించి వివరించారు. సాధారణంగా క్యాటరాక్ట్ వయస్సు పెరిగే కొద్దీ వచ్చే సమస్యని, ఆధునాత పద్ధతుల్లో వైద్యం ద్వారా ఇంతకు ముందులా జాగ్రత్తలు పెద్దగా తీసుకునే పని లేకుండా స్వల్ప జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని అన్నారు. పాత రోజుల్లో క్యాటరాక్ట్ అనగా శుక్లం బాగా ముదిరే వరకూ ఆపరేషన్ చేసే వారు కాదని, ఇప్పుడు అవసరం, అవకాశం బట్టి చేస్తున్నారని అన్నారు. నీటి కాసుల గురించి వివరిస్తూ రక్తపోటున్న వారికి, ధూమపానం చేసే వారికి ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. కంటిలోని నీరు బహిర్గతం అవ్వకపోతే ఈ నీటికాసుల సమస్య తలెత్తుతున్నాయని వివరించారు. ఈ సమస్యకు లేజర్, మందులు, శస్త్ర చికిత్స విధానాలు అనుసరించి వైద్యం చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్య తలెత్తితే తిరిగి మామూలు స్థితికి తీసుకురాలేమని, అయితే జీవితాంతం మందులు వాడుతూ సమస్య పెద్దది కాకుండా ప్రయత్నం చేయొచ్చని అన్నారు. చనిపోయిన 6 గంటలలోపు కార్నియా తీయాలని, నేత్రదానం చేయదలిచిన వారు చనిపోయిన వెంటనే వైద్యులకు సమాచారం ఇచ్చి, మరణించిన వ్యక్తిని ఫ్యాన్‌లేని గదిలో ఉంచాలని, వీలైతే ఏసీ ఉన్న గదిలో ఉంచి, కళ్లు మూసి, కళ్లపై తడిగుడ్డ ఉంచాలని సూచించారు. సమావేశానికి టి.విసాయిరాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, ప్రొఫెసర్ రత్నారావు, ఎం.ప్రసాదరావు, సుజాత, కె.శివరామిరెడ్డి పాల్గొన్నారు.

విద్యా, గుణ సంపన్నుడు కన్నా మాస్టారు

సత్కార సభలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్

ప్రజాశక్తి - గుంటూరు


కన్నా మాస్టారు దంపతులను సత్కరిస్తున్న వీసీ రాజశేఖర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

విద్యార్థి దశ నుండే సమాజంలోని పేద, బడుగు బలహీన వర్గాల పిల్లల విద్యాభివృద్ధి కోసం మనస్సులో పునాదులు వేసుకొని, ఉన్నత ఉద్యోగాన్ని కాలదన్ని నాలుగున్నర దశాబ్దాలుగా గుంటూరు నగరంలో విద్యాభివృద్ధికి కషి చేస్తున్న కన్నా మాస్టారును విద్యా, గుణ సంపన్నుడిగా కీర్తించవచ్చని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ అన్నారు. వర్సిటీ పాలకమండలి సభ్యులుగా ఇటీవల నియమితులైన కన్నా మాస్టర్‌ను నగరంలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ ఉపాధ్యాయ సంఘాలు, జన విజ్ఞాన వేదిక, తదితర సంస్థలు సత్కరించాయి. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ఏడాది అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నట్లు చెప్పారు. విద్యాపరంగా కన్నా మాస్టర్ విశేష అనుభవం, దార్శనికత విశ్వవిద్యాలయ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కన్నా మాస్టర్‌లోని నిజాయితీ, విద్యార్థుల పట్ల అంకితభావం, రాజకీయాలకతీతంగా మసులుకొనే స్నేహ స్వభావం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా కన్నా మాస్టారు, రాజేశ్వరిదేవి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిద్దయ్య, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ వసంతరావు, డాక్టర్ కె.చంద్రశేఖరరావు, కె.వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, అపుస్మ, అప్స, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఒకటిన ఆయుష్మాన్ భారత్ ఉచిత నమోదు

ప్రజాశక్తి-తెనాలి


వివరాలు చెబుతున్న దిలీప్‌రాజా

కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పేదలకు ఎంతో ఉపయోగమని పెన్నీ మినిస్ట్రీస్ అధినేత దిలీప్‌రాజా చెప్పారు. స్థానిక పెదరావూరు కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యబీమా పథకంతో ఎంపిక చేసిన వైద్యశాలల్లో రూ.5 లక్షల వరకూ వైద్య సదుపాయం అందుతుందన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చెల్లించాల్సిన రుసుమును పెన్నీ మినిస్ట్రీస్ ద్వారా చెల్లిస్తూ వచ్చేనెల ఒకటిన ఫ్రీ రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సుల్తానా బాద్‌లోని రత్నా ఫార్చ్యూన్ కన్వెన్షన్‌లో నిర్వహించే రిజిస్ట్రేషన్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని, ఆధార్‌కు లింకైన మొబైల్‌తో పాటు ఆధార్ జిరాక్స్‌తో సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో మిలటరి ప్రసాద్ పాల్గొన్నారు.

రాజధాని మహిళా రైతు మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు


మృతురాలు యెడ్లూరి పార్వతమ్మ (ఫైల్)

రాజధాని ఉద్యమంలో తొలి నుండీ పాల్గొంటున్న అనంతవరానికి చెందిన యెడ్లూరి పార్వతమ్మ (80) ఆదివారం మృతి చెందారు. వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేసినరోజు నుంచి ప్రతిరోజూ ఉద్యమంలో ఆమె పాల్గొన్నారు. పార్వతమ్మ.. పెద్దదానివి.. ఇబ్బంది పడతావు అని తోటి రైతులు వారిస్తున్నా దీక్షల్లో పాల్గొనేవారు. అమరావతి నిర్మాణానికి 12 ఎకరాలు ఇచ్చారు. ఆమె మృతిపట్ల రైతు జెఎసి విచారం వ్యక్తం చేసింది.


లేఖలు చూపుతున్న మహిళా రైతులు

1377వ రోజుకు దీక్షలు

రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు, మహిళలు, రైతు కూలీలు చేస్తున్న దీక్షలు ఆదివారంతో 1377వ రోజుకు చేరాయి. తుళ్లూరు, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి. చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా తుళ్లూరు రైతు దీక్షా శిబిరంలో రైతులు, మహిళలు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబుకు లేఖలు పంపారు. ప్రభుత్వం తక్షణమే కౌలు చెల్లించాలని వెంకటపాలెం రైతులు డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి బిల్డ్ అమరావతి - సేవ్ ఆంధ్రప్రదేశ్ అని నినాదాలు చేశారు.


వివరాల నమోదులో ఆరోగ్య సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్షపై ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-తెనాలి

జగనన్న ఆరోగ్య సురక్షపై ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ అవగాహన కల్పిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రచారంలో బిపి, షుగర్, రక్తహీనత వంటి వాటికి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇతర వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారి వివరాలను సిబ్బంది ఆన్‌లైన్లో నమోదు చేస్తున్నారు. జగనన్న సురక్షపై ఇంటింటికి కరపత్రాలు పంచుతున్నారు. దీనిలో భాగంగా ఆదివారం పట్టణంలోని చినరావూరుతోట, ముత్తింశెట్టివారిపాలెం, నందులపేట సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించారు. వచ్చేనెల ఐదున నిర్వహించే వైద్యశిభిరాల్లో అవసరమైన వారికి చికిత్సలు అందిస్తారని ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎ.బాలచంద్రమౌళి, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, ఎఎన్ఎంలు అంకమ్మ, కొండమ్మ, లక్ష్మీప్రసన్న, అశా కార్యకర్తలు రాణి, అరుణకుమారి, వాలంటీర్లు సత్తార్‌బేగం, అరుణశ్రీ, పాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్

శాస్త్రీయ భావజాలాన్ని ప్రచారం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఆధునిక సమాజంలోనూ మూఢనమ్మకాలు పెరుగుతున్న నేపథ్యంలో సమాజంలో శాస్త్రీయ భావజాలాన్ని ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ అన్నారు. ఆదివారం జెవివి జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు టి.జాన్‌బాబు అధ్యక్షతన బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో విస్తృతంగా ఆశాస్రీయ భావజాలం ప్రచారం జరుగుతోందని, దాన్ని ఖండిస్తూ ప్రజలకు వాస్తవాలు అర్థమయ్యేలా శాస్త్రీయ భావజాలాన్ని తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లాప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ గుర్రం జాషువా, గాంధీ జయంతి సందర్భంగా పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జి.వెంకటరావు, బి.శంకర్‌సింగ్, ఎస్.ఎం.సుబానీ, నటరాజ్, ఎం.ఉదయభాస్కర్, బి.ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.



ఐఎంఎ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నరేంద్రరెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు సిటి

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ నూతక్కి శ్రీనివాస్, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రాత్రి గుంటూరులోని ఐఎంఎ హాలులో జరిగిన సమావేశంలో నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ నూతక్కి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ వెలగ మహేష్, కార్యదర్శిగా డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ బి.సాయికృష్ణ ఎన్నికయ్యారు. అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ కమిటీ అభివృద్ధికి దోహదపడటంతో పాటు, స్థానికంగా వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ విభాగాల్లో వస్తున్న సాంకేతిక అభివృద్ధిని ఇక్కడి వారికి పరిచయం చేసేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

దోమతెరలు వాడితే 95 శాతం జ్వరాలు రావు

- పంపిణీ కోసం 75 వేలు అవసరమని ప్రభుత్వానికి నివేదిక
- ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా నిర్ధారణ పరీక్షలు, చికిత్స
- దోమల నివారణకు ప్రజల సహకారమూ అవసరం
- పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్రరత్నాకర్



సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి జి.రవీంద్ర రత్నాకర్ అన్నారు. పల్నాడు జిల్లాలో ఇటీవల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధులతో పాటు వైరల్ ఫీవర్లకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

డెంగీ, మలేరియా, చికున్ గున్యా నివారణకు ఏం చర్యలు చేపట్టారు?

వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వారంలో ఒక రోజు అంటే ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహణకు చర్యలు తీసుకున్నాం. డెంగీ జ్వరం అనేది ఈడిస్ ఈజిప్టు అనే దోమ ద్వారా వ్యాపించే ఒక అంటు వ్యాధి. దోమ కాటు వల్ల వచ్చే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, విష జ్వరాలు తదితర వ్యాధులు ప్రభలకుండా ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,హెల్త్ సూపర్ వైజర్లు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పేరుతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.

దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

దోమల నివారణకు ప్రజల సహకారం అవసరం. ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఎయిర్ కూలర్‌లలో నీరు, నీటి తొట్టెల్లో నీటిని వారం రోజులకు ఒకసారి మార్చుకోవాలి. దీంతోపాటు ఇంటి పరిసరాల్లో తాగి పడేసిన కొబ్బరి బొండాలు, టైర్లును లేకుండా చూసుకోవాలి. మురుగు కాల్వల్లో చెత్త చెదారం వేయకుండా, ఇంట్లోని పనికిరాని వస్తువులను తొలగించుకోవాలి. ఈ చర్యల ద్వారా దోమలను కొంతమేరకు నివారించొచ్చు.

వ్యాధుల లక్షణాలు ఏమిటి? నిర్ధారణ పరీక్షలు ఎక్కడ చేస్తున్నారు?

డెంగీ, మలేరియా జ్వరం లక్షణాలు రోగి వయసుపై ఆధార పడి ఉంటాయి. అధిక జ్వరం, కండరాలు, కీళ్ల నొప్పులు, నీరసం, తలనొప్పి, అలసట, ఆకలి మందగించడం, కళ్ల వెనుక నొప్పి వంటి లక్షణాలు ఆయా వ్యాధులు సోకిన వారిలో ఉంటాయి. సాధారణ జ్వరాల బారిన పడిన వారికి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో రాపిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయి. డెంగీకి మాత్రం 'ఎలీసా' పరీక్షల ద్వారా మాత్రమే నిర్ధారించి అనంతరం చికిత్స అందిస్తారు. ఈ 'ఎలీసా' పరీక్షలు నరసరావుపేట పట్టణ సమీపంలో లింగంగుంట్లలో గల డాక్టర్ వైఎస్ఆర్ జిల్లా హాస్పిటల్ లో మాత్రమే అందుబాటులో ఉంది. ఉచితంగానే చేస్తారు.

ఇప్పటి వరకు ఎన్ని రక్త నమూనాలు సేకరించారు?

వైరల్ జ్వరాలు సోకిన నుండి ఇప్పటి వరకు 133503 మంది వద్ద నుండి నమూనాలు సేకరించాం. వీటి లో 553 డెంగీ అనుమానిత కేసులకు పరీక్షలు చేయగా 66 డెంగీ కేసులు, 4 మలేరియా కేసులు నమోదయ్యాయి.

వ్యాధి నిర్ధారణ అయిన ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టారా?

కేసులు నిర్ధారనైన ప్రాంతాల్లో సిబ్బంది పర్యటించి బాధితుల కుటుంబ సభ్యుల నుండి కూడా రక్త నమూనాలు సేకరించడం, పరీక్షలు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాం. ఆయా ప్రాంతాల వివరాలను గ్రామీణ ప్రాంతాల్లో అయితే జిల్లా పంచాయితీ అధికారులకు, పట్టణ పరిధిలో అయితే మున్సిపల్ కమిషనర్‌కు అందజేస్తాం. వారి పర్యవేక్షణలో ఫాగింగ్, మురుగు కాల్వలలో పూడికతీత, పరిసరాలను శుభ్రం చేస్తారు.

పల్నాడు జిల్లాలో దోమతెరలు పంపిణీ చేశారా ?

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2019లో ప్రభుత్వ పరంగా వచ్చిన 60 వేల దోమతెరలను మొత్తం పల్నాడు జిల్లాలో పంపిణీ చేశాం. హై రిస్క్ కలిగిన ప్రాంతాలపై దోమల నివారణకు దోమతెరలు పంపిణీ చేశాం. జిల్లాలో ఏయే ప్రాంతాల్లో మురుగునీరు ఎక్కువ నిల్వ ఉంటుందో వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు దోమల లార్వాలను నాశనం చేసేందుకు చర్యలు చేపట్టాం. మాచర్ల, కారంపూడి, బొల్లాపల్లి తదితర మండలాల్లోని గిరిజన, చెంచు కాలనీలో, దళితవాడలలో పంపిణీ చేశాం. ప్రస్తుతం పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 75 వేల దోమతెరలు అవసరమని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. గతంలో పంపిణీ చేసిన 60 వేల పాత దోమతెరలను వెనక్కు తీసుకొని తిరిగి మళ్లీ వారికి కొత్తవి ఇస్తాం. పేదల వాడల్లో ఉండే ప్రజలకు, జిల్లాలోని 137 ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నాం.

ప్రజలకు ఎలా అవగాహన కల్పిస్తున్నారు?

ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ లేకుండా ఉండేలా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం. పొరపాటున ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నిలువ ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే వాటిని తొలగించి దోమల లార్వాలను నాశనం చేస్తున్నాం. కేసులు నమోదయ్యాయని గుర్తిస్తే డెంగీ మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పర్యటించి వ్యాధిగ్రస్తుల నుండి ఇంటి చుట్టుపక్కల ఉన్న వారి రక్తనాళాలు సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ఉదయం సాయంత్రం సమయాల్లో చలి ప్రదేశాలలో తిరగకూడదు. అదే సమయంలో ఈ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు చైతన్య పరిచి దోమల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనేది తెలియజేస్తున్నాం.

జ్వరాలతో ఎవరైనా మరణించారా?

పల్నాడు జిల్లా ఏర్పడ్డాక డెంగీ, చికున్ గున్యా, మలేరియా వ్యాధులు భారిన పడిన వారు చికిత్స పొంది పూర్తిగా కోలుకున్నారు. మరణాలేమీ సంభవించలేదు. వ్యాధుల బారిన పడిన వారికి ప్రభుత్వ ఏరియా, విలేజ్ హెల్త్ క్లినిక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో ఉచితంగా చేస్తున్న పరీక్షలు చికిత్సలపై సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటి సర్వే నిర్వహించడంతోపాటు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం, మందులు పిచికారీ కార్యక్రమంలో చర్యలు తీసుకున్నాం. ఆయా వైద్య బృందాలతో సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఇచ్చే సూచనలు?

డెంగీ, మలేరియా,ఫైలేరియా, టైఫాయిడ్, మెదడు వాపు వ్యాధులు దోమ కాటు వల్ల వ్యాపిస్తాయి. వీటితో పాటు కొత్తగా 'జికా' అని పిలువబడే కొత్త వైరస్ ఉత్తరప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రంలలో విజంభించింది. ప్రజలు చిన్నారులు దోమకాటుకు గురి కాకుండా విధిగా దోమ తెరలు వినియోగించడం ద్వారా 95 శాతం వరకు ఆయా వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది. కొద్ది వారాలుగా చికున్ గున్యా, డెంగీ, మలేరియా జ్వరాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఆయా వ్యాధులు ప్రాణాతకం కకపోయినా అశ్రద్ధ చేయకుండా వైద్యుల సూచన మేరకు చికిత్స పొందడం శ్రేయస్కరం.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 2న చిత్ర లేఖనం పోటీలు



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు చిత్ర కళా పోటీల కన్వీనర్ కట్టా కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో చిత్ర లేఖనం పోటీల కరపత్రాన్ని విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వచ్చేనెల 2న గాంధీ జయంతి సందర్భంగా రావిపాడు రోడ్డులోని శ్రీకృష్ణ చైతన్య హైస్కూల్ (డిఆర్ అకాడమీ)లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. పోటీలకు ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్, నరసరావుపేట డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కె.వేణుగోపాలరావు, పల్నాడు జిల్లా బాలిక శిశు అభివృద్ధి శాఖ (సిడిపిఒ) జిల్లా అధికారి డి.రేవతి, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం మాజీ గౌరవ అధ్యక్షులు ఎం.ఎస్.ఆర్.కె ప్రసాద్ హాజరై బహుమతులు ప్రదానం చేస్తారని చెప్పారు. నరసరావుపేట ప్రాంతీయ పరిధిలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో 3 నుండి 10 వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అర్హులన్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులు సబ్ జూనియర్స్ విభాగంలో గాంధీజీ చిత్రం, 6, 7, 8 తరగతుల విద్యార్థులు జూనియర్స్ విభాగంలో గాంధీజీ మత సామరస్యం ఉట్టి పడేలా గాంధీజీ చిత్రం, సీనియర్ విభాగంలో 9, 10 తరగతుల విద్యార్థులు గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం అంశాలు ఉట్టి పడేలా చిత్రం వేయాలన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థులకు విజ్ఞాన కేంద్రం తరపున ఏ4 షీట్ మాత్రమే ఇస్తారని, మిగతా పరికరాలు విద్యార్థులే తెచ్చుకోవాలని తెలిపారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, రెండు 2 కన్సోలేషన్ బహుమతులు ప్రదానం చేయడతోపాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ప్రశంశా పత్రం ఇస్తామన్నారు. విజ్ఞాన కేంద్రం కోశాధికారి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులతో పాటు యువత కళాకారులు తమ కళారూపాలను ఆవిష్కరింప చేసేందుకు పల్నాడు విజ్ఞాన కేంద్రం ఒక వేదిక కాబోతుందని అన్నారు. చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనేవారు 7207450369, 9246493157, 9885118116, 9949809821 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కార్యనిర్వహణ కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు బాగేశ్వరిదేవి, కె.రామారావు, డి.శివకుమారి, శివపార్వతి, శిరీష, మస్తాన్‌రావు, చిన్న ఓబయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.